# సూర్యోదయం కుట్రకాదు! కవిత్వం కుట్ర కాదు!
# విరసం కార్యవర్గ సభ్యుడు కా. కాశీం పై కుట్ర, రాజద్రోహ కేసును వెనక్కి తీసుకోవాలి
# అప్రజాస్వామిక ఊపా చట్టాన్ని రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో తొలి కుట్ర కేసు నమోదైంది. అదీ ఒక రచయిత మీద. కుట్ర కేసుల చరిత్ర చూస్తే అదేమీ ఆశ్చర్యం కలిగించదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్వతీపురం కుట్ర కేసు మొదలు సికింద్రాబాద్, రాంనగర్, తిరుపతి, ఔరంగాబాద్ కుట్రకేసుల దాకా అన్నింటిలో రచయితలపై కుట్ర ఆరోపణలు చేసింది రాజ్యం. ఇప్పుడు కాశీంపైనా అదే కుట్ర. కా. కాశీం కనీసం ఇరవై ఏళ్లుగా, అంటే మలితరం తెలంగాణ విద్యార్థి ఉద్యమం నుండి ప్రజా ఆచరణలో ఉన్నవాడు. తెలంగాణ రాష్టం కోసం విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాల్లో భాగమైన వాడు. అదేమీ కుట్ర కాదు. ఆయన మట్టి పరిమళాల, బతుకు అలజడుల కవిత్వం రాసిన వాడు. సాహిత్య విమర్శకుడు, సైద్ధాంతిక రాజకీయ విశ్లేషణలు అందించే మేధావి, వక్త. 'నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్న (వ్యాసాలు)', 'తెలంగాణ ఉద్యమాలు - పాట (వ్యాసాలు)', 'కాశీం కవిత్వం', 'తెలంగాణ సాహిత్య వ్యాసాలు', 'పొలమారిన పాలమూరు (దీర్ఘకవిత)', 'గుత్తికొండ (దీర్ఘ కవిత)', 'మానాల (దీర్ఘకవిత)', 'వర్గీకరణ నాలుగు వ్యాసాలు', 'ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు-విద్రోహ రాజకీయాలు (వ్యాసాలు)', 'ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం (పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం)', 'ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం (ఎంఫిల్ పరిశోధన పత్రం)' వంటి పదికి పైగా పుస్తకాలు ప్రచురించాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనే కాదు బహుశా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిచయమంతా అక్కరలేని పేరు ఆయనది. కాశీం విప్లవం ద్వారా సమాజిక మార్పు సాధ్యమనే ప్రాపంచిక దృక్పథం కలవాడు. ప్రజాస్వామిక తెలంగాణను కోరుకున్నాడు. అది నేరం కాదు. ఆయన సంపాదకత్వం వహిస్తున్న 'నడుస్తున్న తెలంగాణ' మాసపత్రిక తెలంగాణలో బలమైన ప్రతిపక్ష గొంతుక. ఈ నెల 20న మేదక్ జిల్లా ములుగు పోలీస్ స్టేషన్‌లో మావోయిస్టు కొరియర్‌గా అనుమానిస్తున్న ఎం. శ్యాంసుందర్ రెడ్డి అనే వ్యక్తితో పాటు కా. కాశీంను రెండవ ముద్దాయిగా చూపుతూ మావోయిస్టులకు లేఖలు రాశాడని అభియోగం మోపారు పోలీసులు. ఐ.పి.సి 120బి, 121ఎ, 124 సెక్షన్ల కింద (ప్రభుత్వాన్ని కూలదొయాలనే నేర పూరిత కుట్ర, రాజద్రోహం, తన మాటలు, చేతల ద్వారా చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంపై విద్వేషాన్ని ప్రేరేపించే ప్రయత్నం చేశాడని), చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA - Unlawful Activities Prevention Act) సెక్షన్ 10, 18 కింద (నిషేధిత సంస్థలో సభ్యుడని, టెర్రరిస్టు చర్యలకు పూనుకున్నాడని) కేసు నమోదు చేశారు. పోలీసులు సృష్టించిన లేఖలతో పాటు మావోయిస్టు అనుబంధ పత్రికలుగా 'నడుస్తున్న తెలంగాణ' పత్రికలు చూపిస్తూ కుట్ర రచన చేశారు. ప్రభుత్వ గ్రంథాలయాలు, యూనివర్సిటీలు సహా తెలంగాణ రాష్ట్రంలో, బైటా ఎంతో మంది చదివే పత్రికను కూడా కుట్రలో చూపడం మరింత అన్యాయం.

గతంలో రెండు సార్లు కామ్రేడ్ కాశీంపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద కేసు నమోదు చేసినప్పుడు విచిత్రంగా ఆయన్ను పరారీలో ఉన్న నిందుతుడిగా పేర్కొన్నారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ప్రతిరోజూ విద్యార్థులకు పాఠాలు చెప్తాడని, బహిరంగ సామాజిక ఆచరణలో ఉంటాడని ప్రభుత్వానికి తెలియంది కాదు. ఇది ప్రజాస్వామిక స్వరంపై ప్రభుత్వ దాడి. భావప్రకటనపై మానసిక యుద్ధం. ఆయనపై నమోదైన కేసుల స్వభావమే అత్యంత అప్రజాస్వామికమైనది. బ్రిటీష్ కాలం నాటి రాజద్రోహం అనే చట్టంతో పాటు తీవ్రవాదాన్ని అరికట్టే సాకుతో వచ్చిన టాడా, పోటా కన్నా దుర్మార్గమైన ఊపా ఒక రచయిత మీద నమోదు చేయడంలోనే రాజ్య స్వభావం అర్థం అవున్నది. తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులకు భరోసా ఇస్తూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ స్వభావం కూడా అంతిమంగా సాధారణ పాలక వర్గ స్వభావమే అని ఏదైతే విరసం చెప్తూ వస్తున్నదో దాన్ని అడుగడుగునా రుజువు చేస్తూ చివరికి కవి మీద కుట్ర చేసేదాకా వచ్చింది. ఇప్పుడు దేశంలో పరమ అప్రజాస్వామిక చట్టాలతో ఒక రచయితను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు.

దేశ చరిత్రలో ప్రజలపై, ప్రజాస్వామికవాదులపై ఎంతో అణచివేతను ప్రయోగించిన టాడా, పోటా వంటి అప్రజాస్వామిక చట్టలు తీవ్ర నిరసనలతో వెనక్కి పోగా అంతకన్నా దుర్మార్గమైన ఊపా చట్టం రంగం మీదికొచ్చింది. సెప్టెంబర్ 21 దాడులను సాకుగా చేసుకొని వచ్చిన ఈ చట్టం దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక ఉద్యమ గొంతుకలపై, విస్థాపన సమస్యపై పోరాడుతున్న ఆదివాసులపై రాజ్యం ప్రయోగిస్తూ వస్తున్నది. కేవలం అనుమానంతోనే అరెస్టు చేసే అధికారం ఈ చట్టం ద్వారా పోలీసులకు సంక్రమిస్తుది. నిర్దోషినని స్వయంగా నిరూపించుకునే దాకా ఈ కేసు మోపబడ్డ వ్యక్తి నేరస్తుడే. ఈ చట్టాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం వందలాది కేసులు నమోదు చేసింది. దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను, తొంబై శాతం అంగవైకల్యంతో తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఏడాదిన్నరగా అమానుష పద్ధతుల్లో నిర్బంధించి చిత్రహింసలపాలు చేస్తున్నది. కా.కాశీంపై కేసు ప్రజాస్వామిక గొంతుల్ని నొక్కివేసే చర్యల్లో భాగమే.

ఒక వైపు దేశమంతా ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ఫాసిజం కరకు కోరల్లో చిక్కుకుపోతోంది. సందుసందునా హిందూ మతం పేరుతో అరాచక శక్తులు చెలరేగిపోతున్నారు. ముస్లింలను, దళితులను, రచయితలను, బుద్ధిజీవులను వెంటాడుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థిలోకం పోరాడుతోంది. ప్రభుత్వం మాత్రం ప్రజాస్వామికవాదులపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోంది. తెలంగాణ వస్తే అక్రమ కేసులన్నీ ఎత్తేస్తామని హామీ ఇచ్చాడు చంద్రశేఖరరావు. ఇప్పుడు ఆయన ప్రభుత్వమే ఫాసిస్టు మూకల చర్యలకు నిశ్శబ్ద ఆమోదాన్ని తెలుపుతూ, ప్రజాసంఘాల కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నది. కామ్రేడ్ కాశీంపై కేసు అప్రజాస్వామికం. నమోదు చేసిన UAPA అంతకన్నా అప్రజాస్వామికం. కా. కాశీంపై కేసును ఎత్తివేయాలని, అట్లాగే UAPAను రద్దు చేయాలని అందరం కలిసికట్టుగా డిమాండ్ చేద్దాం. ప్రభుత్వ అణచివేత విధానాన్ని నిరసించాల్సిందిగా రచయితలూ, ప్రజాసంఘాలూ, ప్రజాస్వామికవాదులకు విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

విప్లవ రచయితల సంఘం

తేది : 28.01.2016

ప్రచురణ కర్తలు : పి. వరలక్ష్మి, రాంకి, www.virasam.in, arunatara1977@gmail.com